క్లుప్తంగా

విద్యుత్ మీటర్ రీడర్ల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, తదితరులు

సీతమ్మధార : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్ల యూనియన్ క్యాలెండర్‌ను ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ గురుద్వార్ సమీపంలోని కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.బాలకాశీ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ మీటర్ రీడర్ల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని, ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరారు. వీటిపై సీఎండీ స్పందిస్తూ మీటర్ రీడర్ల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఎస్ క్రో అకౌంటు ద్వారా వేతనాలు చెల్లించడం వచ్చే నెల నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హనుమంతు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైటు పునరుద్ధరణ



సరిచేసిన తర్వాత విద్యుత్ లైటు

సాక్షి ఎఫెక్ట్..

మద్రిపాలెం : వీధిలైటు వేలాడుతుండడంతో 'ప్రమాదకరంగా వేలాడుతున్న లైటు' అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. జీవీఎంసీ 50వ వార్డు మాధవధార జంక్షన్ 48వ నంబరు బస్టాప్ సమీపంలో ఓ ఇంటి ముందు వీధిలైటు ప్రమాదకరంగా వేలాడుతుండడంతో దాన్ని సిబ్బంది పునరుద్ధరించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలకు మంచి స్పందన



ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగి

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ శిబిరాలు గురువారంతో ముగిశాయని జోన్ – 3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. ఈ నెల 21 నుంచి రెండు విడతలుగా ఏర్పాటు చేసిన శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆధార్ కార్డులు తీసుకోని పిల్లల కోసం శిబిరాలు ఏర్పాటు చేశామని, అందరూ సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీమణులు

సీతంపేట : నగరానికి చెందిన సాయిప్రియ రాగప్రభ సంగీత సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయనీమణులు సూర్యప్రభ, రంజిత, సుజాత, సత్యశ్రీ, స్వాతిరెడ్డి, భవాని, రమణి, గంటి ఉష, శ్రీదేవి తదితరులు అలనాటి ఆపాత మధుర గీతాలను ఆలపించారు. గాయకులు కె.ఎల్.రావు, భయ్యా శ్రీనివాస్, అరుణకుమార్, భరద్వాజ్, వీరాస్వామి, పత్తి ప్రసాద్, మహమ్మద్ ఖాన్, వెంకట్, కోటేశ్వరరావు తదితరులు యుగళ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కళాసంస్థల ప్రతినిధులు కొణతాల రాజు, గిరిజ శంకర్, సన్‌మూర్తి పాల్గొన్నారు.



రెచ్చిపోతున్న ఆకతాయిలు

- జోరుగా బైక్‌లు, సైకిళ్ల దొంగతనాలు
- బెంబేలెత్తిపోతున్న మహత్‌కాలనీ వాసులు

మద్రిపాలెం :

ద్విచక్ర వాహనాల చోరీలకు అడ్డూ అదుపూ లేకపోవడంతో మహత్‌కాలనీ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రి పూట క్రైం పోలీసుల గస్తీ అంతంతమాత్రంగా ఉన్నందునే వాహనాల చోరీ జరుగుతోందని, అదును చూసుకుని ఆకతాయిలు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ పోలీసులు నిర్లక్ష్యం వీడడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. జీవీఎంసీ 51వ వార్డు మహత్‌కాలనీలో రోజురోజుకీ ఆకతాయిల ఆగడాలు పెరిగిపోతున్నాయి. రెండు రోజుల కిందట (ఈ నెల 26న) ఓ బైక్‌ను దుండగులు అపహరించారు. స్థానిక నివాసి తన బైక్‌ను రోజూ మాదిరిగా పార్కింగ్ చేసుకుని కొండ మీద ఉన్న ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు 27న ఉదయం లేచి వచ్చి చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. అలాగే 15 రోజుల కిందట స్థానికంగా నివసిస్తున్న ఓ కుటుంబం వారి సమీప బంధువులు మరణించారని తెలిసి బైక్, సైకిల్ కలిపి చైన్‌తో లాక్ చేసి ఊరు వెళ్లారు. ఊరు నుంచి వచ్చి చూసేసరికి సైకిల్ కనిపించ లేదు. వెంటనే వారు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల కిందట ఓ వ్యక్తి విధులు ముగించుకుని బైక్‌లో రూ.500 పెట్రోల్ పోయించుకుని ఇంటి బయట పార్కింగ్ చేశారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి బండి బయటకు లాగేసి ఉంది. అందులో ఉన్న పెట్రోలు చుక్క కూడా మిగల్చకుండా తీసేయడమే కాకుండా, బైక్ తాళం విరగ్గొట్టేసి, కొన్ని స్పేర్ పార్ట్స్ కూడా లాగేసి రోడ్డు మీద వదిలేసి వెళ్లిపోయారు. అంతేకాకుండా పలు బైక్‌ల షీట్ కవర్లు కట్ చేసి, టైర్లు కోసేసి వెళ్లిపోయారు. మద్యం, గంజయి మత్తులో కొందరు ఉన్నాదుల్లా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఆకతాయిలకు అడ్డాగా మారిన మహత్‌కాలనీ రోడ్డు

తరచూ దొంగతనాలు

గత నాలుగు నెలల్లో రెండు బైక్‌లు పోయాయి. అలాగే పెట్రోలు దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు. రాత్రయితే ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. ఎవరు ఎక్కడి నుంచి వచ్చి ఏం చేస్తారో అని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం. ఇప్పటికైనా పోలీసులు స్పందించి.. దొంగలను పట్టుకుని, వారిపై చర్యలు తీసుకోవాలి.

– సీతాలక్ష్మి, మహత్‌కాలనీ

పట్టించుకోవడం లేదు

మహత్‌కాలనీ పరిసరాల్లో రోజురోజుకీ ఆకతాయిలు రెచ్చిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. బైక్ దొంగతనాలు, వాహనాలు తరచూ ధ్వంసం చేస్తున్నా కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఆకతాయిలు అర్ధరాత్రి సమయంలో పెద్దపెద్ద కేకలు వేస్తూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆ సమయంలో ఇళ్లలో ఉన్నా భయమేస్తోంది. పోలీసులు స్పందించాలి.

– బాలామణి, మహత్‌కాలనీ

పోలీసుల గస్తీ లేకపోవడం వల్లే...

నాలుగు నెలల వ్యవధిలో రెండు బైక్‌లు, సైకిళ్లు పోవడంతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో ఆటోలు, బైక్‌లు ఓ చోట పార్కింగ్ చేసుకుని ఇళ్లకి వెళ్లిపోతారు. ఆటోలు ఖాళీగా ఉండడంతో కొంద మంది దుండగులు లోపల కూర్చొని మద్యం సేవిస్తున్నారని, అటుగా రాకపోకలు సాగించలేకపోతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో లైట్లు కూడా ఎప్పుడు వెలుగుతాయో..? ఎప్పుడు వెలగవో తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఎయిర్ పోర్టు జోన్ క్రైం పోలీసులు రాత్రి గస్తీ నిర్వహించకపోవడం వల్లే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, విచ్చలవిడిగా దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గంజాయి బ్యాచ్ కూడా ఈ ప్రాంతంలో స్వేచ్ఛగా తిరుగుతున్నారని, రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ శూన్యమని ఆరోపిస్తున్నారు. వాహనాల దొంగతనాలు జరిగినప్పుడు మాత్రం పోలీసులు నామమాత్రానికి వచ్చి చూసుకుని వెళ్లిపోతున్నారని బాధితులు మండిపడుతున్నారు. ఒంటరి మహిళలు, కుటుంబాలతో ఉండే వారు సాయంత్రమయ్యాక ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే భయమేస్తోందని అంటున్నారు. పోలీసులు రాత్రి గస్తీ నిర్వహిస్తే దుండగుల ఆగడాలకు, మందుబాబుల అల్లరికి అడ్డుకట్ట పడుతుందని స్థానికులు అంటున్నారు. ఈ విషయమై ఎయిర్‌పోర్టు జోన్ క్రైం పోలీసుల వివరణ కోరగా ఆకతాయిలు మద్యం సేవించి దొంగతనాలకు పాల్పడుతున్నట్టు అంచనా వేస్తున్నట్టు చెబుతున్నారు. రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తున్నామని, సంక్రాంతి నుంచి గస్తీ కూడా పెంచామని చెబుతున్నారు. మరి ఆకతాయిల ఆటలకు పోలీసులు పూర్తిగా చెక్ పెట్టేది ఎప్పుడో వేచి చూడాల్సిందే.



దొంగతనానికి గురైన సైకిల్

రాజశ్యామల నవరాత్రులు ప్రారంభం



రాజశ్యామల అమ్మవారికి పూజలు చేస్తున్న దత్తేశ్వరానంద స్వామి

సీతంపేట : అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో రాజశ్యామల నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి ప్రత్యేక పూజలు చేసి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అర్చన, మణిద్వీపంలో సహస్రనామార్చన, అలంకరణ చేశారు. శుద్ధ అష్టమి సందర్భంగా ఫిబ్రవరి 5న ఉదయం 9:30 గంటలకు రాజశ్యామల హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, సిబ్బంది రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఉత్తరాఖండ్ రాష్ట్రం, ఉదమ్‌సింగ్‌నగర్ జిల్లాకు చెందిన సురేష్‌కుమార్, ఒడిశా రాష్ట్రంలోని రాయగడ జిల్లాకు చెదిన కిరణ్‌లామా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

- విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ వి.కీర్తిరెడ్డి సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన సాగర్ ప్రధాన్ అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. అతని నుంచి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

జోన్ – 3 పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ వెల్లడించారు. ఆశీలమెట్ట అశోక్‌నగర్‌లో గల జోనల్ కార్యాలయంలో అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిమిత్తం కలెక్టర్ గురువారం షెడ్యూల్ విడుదల చేశారని గుర్తు చేశారు. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారని, 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ గడువు ముగుస్తుందన్నారు. ఫిబ్రవరి 27న ఎన్నిక నిర్వహిస్తారని, మార్చి 3న ఓట్లు లెక్కిస్తారని తెలిపారు. జోన్ – 3 పరిధిలోని పోలింగ్ బూత్‌లలో త్వరలోనే ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఓటర్ల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం



వైశాఖి పార్కులో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు



నివాళులర్పిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్ : అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మహిళా వాకర్స్ క్లబ్ మాధవధార అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన స్థానిక బ్యాంకు వీధిలోని వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అలాగే మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. మహిళలు దేశభక్తి గీతాలు ఆలపించారు. అనంతరం కుంభమేళాలో మృతి చెందిన భక్తుల ఆత్మశాంతికి మౌనం పాటించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ కె.ద్వారకానాథ్, క్లబ్ కార్యదర్శి పి.కమల, కోశాధికారి ఎం.శేషమణి, సీహెచ్.వరలక్ష్మి, డి.శిరీష, లక్ష్మీకుమారి, తులసి, ప్రభ, జయశ్రీ, సుగుణ, ఎం.రాధ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

- మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో గాంధీజీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. గాంధీజీ చిత్రపటానికి క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ నివాళులర్పించారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలు, బోధనలను వివరించారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ బుచ్చయ్య, సనపల వరప్రసాద్, ఎల్.వి.సుధాకర్, ప్రసాదరావు, జి.విజయలక్ష్మి, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.
- వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లోని గాంధీజీ విగ్రహానికి పార్క్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసా మార్గంలో స్వాతంత్ర్యం కోసం పోరాడారని గుర్తు చేశారు.



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్యామలదీపిక, తదితరులు

సీతమ్మధార : గాంధీ మహాత్ముడు భారతీయుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక అన్నారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల బీజేపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఆమె గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే ఫైలేరియా వ్యాప్తి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: నిర్లక్ష్యం వల్లే ఫైలేరియా వ్యాధి పెరుగుతుందని జిల్లా మలేరియా అధికారి తులసి అన్నారు. వరల్డ్ నెగ్లెక్టెడ్ ట్రాపికల్ డిసీజెస్ డేను పురస్కరించుకుని జిల్లా మలేరియా విభాగం, జీవీఎంసీ సంయుక్తంగా గురువారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ఫైలేరియా వ్యాధికి కారణమైన క్యూలెక్స్ దోమలు మురుగు నీటి కాల్వల్లో పెరుగుతాయని, దోమలు పెరగకుండా చూడడం ద్వారా ఫైలేరియా వ్యాధి బారిన పడకుండా చూడవచ్చన్నారు. క్యూలెక్స్ దోమ కాటు బారిన పడిన వారికి 15 నుంచి 30 రోజుల్లో లేదా 3 నుంచి 6 నెలల్లో వాంతులతో కూడిన జ్వరం, శరీరంలో కాళ్లు, చేతులు, గుండె వంటి భాగాలు ఎర్రబడడం, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయని, అటువంటి లక్షణాలు కనిపించినప్పుడు సమీపంలో గల మలేరియా సబ్ యూనిట్ కార్యాలయానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ తర్వాత వీలైనంత త్వరలో చికిత్స ప్రారంభించడం ద్వారా వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి, అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పటానాయక్, ఎంపీహెచ్‌వో శేషుబాబు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, జీవీఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మద్రిపాలెం : జోన్ – 2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో 11 కేవీ కరాస ఫీడర్ నిర్వహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు ప్రక్రియలో భాగంగా ఓల్డ్ కరాస, న్యూ కరాస, శాంతినగర్, మాధవధార ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, కైలాసపురం, శాంతినగర్, సంజీవయ్యకాలనీ, నరసింహనగర్, కైలాసపురం మెయిన్ రోడ్, బాలయ్య శాస్త్రి లే అవుట్, ఎన్‌జీజీవోస్ కాలనీలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

- శ్రీకన్య థియేటర్ ఫీడర్ పరిధిలో శ్రీకన్య థియేటర్ ప్రాంతం, సుబ్బలక్ష్మినగర్, రైల్వే న్యూ కాలనీ మెయిన్ రోడ్, రైల్వే న్యూ కాలనీ, 80 ఫీట్ రోడ్, శ్రీనివాసనగర్, మహారాణి పార్లర్, పుట్ట బంగారమ్మ గుడి ప్రాంతం, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, అక్కయ్యపాలెం బాబా గుడి ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బందిపాల్గొన్నారు.

ఫుట్‌పాత్ తవ్వేసి.. ఇష్టానుసారంగా నిర్మాణాలు



కారు పార్కింగ్ కోసం తవ్వేసిన ఫుట్‌పాత్

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులో గల బాలయ్య శాస్త్రి లే అవుట్ ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులు రోడ్లు, ఫుట్‌పాత్‌లు ధ్వంసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడి పోర్టు స్టేడియం ఈస్ట్ గేటు సమీపంలో ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎం కేంద్రం ఆవరణలో గల జీవీఎంసీ ఫుట్‌పాత్‌ని అక్రమంగా తవ్వేయడం తీవ్ర దుమారం రేపుతోంది. పైగా ఇక్కడ కారు పార్కింగ్ కోసం కాలువ మూసేసి మరీ చదును చేసేయడం గమనార్హం. ఇంత జరుగుతున్నా జోన్ – 3 ఇంజినీర్లు, సచివాలయం టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జీవీఎంసీ ఒకవైపు ప్రజాధనం వెచ్చించి రోడ్లు, ఫుట్‌పాత్‌లు నిర్మిస్తుంటే... కొందరు స్వార్థంతో ధ్వంసం చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. వర్షపు నీరు సైతం కాలువలోకి వెళ్లకుండా నిర్మాణాలు చేస్తున్నా సచివాలయ సిబ్బంది, జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జోన్ – 3 అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భూపాలవర్మ మృతికి సంతాపం



భూపాల వర్మ (ఫైల్)

తాటిచెట్లపాలెం : జగద్గురుపీఠం కార్యనిర్వాహక సభ్యుడు ఉప్పలపాటి చిట్టి భూపాలవర్మ మృతి తమ సంస్థలకు తీరని లోటని జగద్గురుపీఠం డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. యుసీహెచ్‌బీ వర్మగా చిరపరిచితులైన వర్మ కృష్ణనగర్‌లో అనారోగ్యంతో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారని, గురువారం అంత్యక్రియలు నిర్వహించారని తెలిపారు. మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య అడుగుజాడల్లో జగద్గురు పీఠానికి వర్మ నాలుగు దశాబ్దాలుగా సేవలందించారని కొనియాడారు. బీఆర్‌కే రాజు, యూఎస్ రాజు, అజ్జరపు శ్రీనివాస్, ఎస్‌వీఎస్ మూర్తి, కంభంపాటి గురుప్రసాద్, ఎస్ఎస్ఎస్ రాము, తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నూర్‌బాషా ముస్లిం సేవా సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: నూర్‌బాషా ముస్లింల ఖబరిస్తాన్‌లలో (శ్మశాన వాటికలు) జీవీఎంసీ అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించాలని షేక్ బురాన్, షేక్ నాగూర్, షేక్ రెహ్మాన్ గురువారం మేయర్ హరి వెంకటకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఖబరిస్తాన్ లేని చోట స్థలం కేటాయించి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. మదర్సాలకు ఉర్దూ టీచర్లను నియమించాలని, మాంసం వ్యాపారం చేస్తున్న వారికి కబేళా అందుబాటులో ఉండే ఏర్పాటు చేయాలన్నారు. నూర్‌బాషా ముస్లింలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో షాదీఖానాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మేయర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా రివ్యూ మీటింగ్‌లో ఈ సమస్యలను తప్పకుండా చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబ్జి, షేక్ సుభాన్, షేక్ మౌలా, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్



అబిద్‌నగర్ రోడ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

సీతంపేట : జీవీఎంసీ 44వ వార్డు పరిధి జాతీయ రహదారి నుంచి అబిద్‌నగర్‌లో పల్లవి ఎన్‌క్లేవ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా కార్లు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో హైవే నుంచి అబిద్‌నగర్, ముస్లిం తాటిచెట్లపాలెం, పెద్దూరుకు వెళ్లే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. హైవేకు అనుకుని సర్వీస్ రోడ్‌లో ఉన్న కార్ల మెకానిక్ షాపులకు వచ్చే వాహనాలను రోజుల తరబడి రోడ్డుపై నిలిపి వేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా పార్కింగ్ చేసిన కార్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.